

## రాజ్యసభ బరిలో నడ్డా

3లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | గురువారం | 15 -02 - 2024
సంపుటి: 1 | సంచిక : 270 | పేజీలు : 4 | వెల : 5/-




# ‘కృష్ణా’వతారం!

- కేసీఆర్ ముందు కృష్ణానది జలాల అంశం
- పార్లమెంట్ ఎన్నికల వేళ బీఆర్ఎస్‌కు ఆయుధం
- గులాబీ బాస్ మరోసారి సెంటిమెంట్ అస్త్రం
- మరో పోరాటానికి గులాబీదళపతి వ్యూహాత్మకంగా అడుగులు

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత రాజకీయ కార్యాచరణను కేసీఆర్ ఖరారు చేసుకున్నారు. అది కృష్ణా ప్రాజెక్టుల అంశం. కేంద్రానికి ప్రాజెక్టులు అప్పగిస్తున్నారని అది తెలంగాణకు తీవ్ర అన్యాయమని ప్రజల్లోకి వెళ్తున్నారు. నల్లగొండలో జరిగిన బహిరంగసభలో కేసీఆర్ తన ఉద్యమం నాటి ప్రసంగాలను గుర్తుకు తెచ్చే ప్రయత్నం చేశారు. కటువైన పదాలు ఉపయోగించారు. తన ప్రాణాన్ని తెలంగాణ ప్రయోజనాల కోసం అడ్డు వేస్తానన్నారు. రాజకీయాల్లో దేనికైనా ఇది ఎలా సాధ్యం అని అనుకోవడానికి అవకాశం లేదు. దేనినైనా సాధ్యం చేస్తేనే రాజకీయంగా విజయం లభిస్తుంది. కేసీఆర్ అలాంటి రాజకీయంలో సిద్ధహస్తులు. అందుకే.. సిద్ధించిన తెలంగాణలో మరోసారి తెలంగాణ సెంటిమెంట్ అస్త్రాన్ని అందుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. బీఆర్ఎస్ తప్ప ఎవరున్నా తెలంగాణకు అన్యాయమేనని

మిగతా 2వ పేజీలో...

# పెట్టుబడికి కట్టుబాట్లు!



- రైతుబంధుకు సర్కారు కండిషన్లు
- ఐదెకరాలలోపు వారికే వర్తింపు
- రేవంత్ ప్రభుత్వం యోచన
- త్వరలో ప్రకటించే అవకాశం

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** రైతు బంధు నిబంధనలపై రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 5 ఎకరాల లోపు వారికే రైతుబంధు ఇవ్వాలనే ఆలోచలనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. గత ఏడాది వానాకాలం లెక్కల ప్రకారం 68.99 లక్షల మందికి రైతు బంధు సాయం అందింది. 5 ఎకరాల లోపు భూమి ఉన్న రైతుల సంఖ్య 62.34 లక్షలు. 5 ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న..రైతుల సంఖ్య 6.65 లక్షలు ఉన్నట్లు రిపోర్టులు చెబుతున్నాయి. వీరి వద్దే మొత్తం 50 లక్షల ఎకరాలు నివేదికలో పేర్కొన్నాయి. 5 ఎకరాల లోపు వారికి రైతుబంధు ఇవ్వాలంటే ఏడాదికి రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 15 వేల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు అధికారులు. ఇలా చేస్తే ఏడాదికి

మిగతా 2వ పేజీలో...



# ఢిల్లీలో లొల్లిలొల్లి..

- ఉద్రిక్తంగా హస్తిన పరిసరాలు
- పెద్ద ఎత్తున తరలివస్తున్నరైతాంగం

**న్యూఢిల్లీ, ప్రభాతసూర్యుడు :** తుల మార్చ్ పంజాబ్, హరియాణా సరిహద్దుల్లో అలజడి సృష్టిస్తోంది. రైతులు, పోలీసుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. ఢిల్లీ వైపు దూసుకొస్తున్న రైతులను అడ్డుకునేందుకు పోలీసులు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారు. భారీ బారికేడ్లు ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున భద్రతా బలగాలు మొహరించాయి. 2020–21 సమయంలో రైతులు భారీగా ఆందోళనలు నిర్వహించారు. అప్పట్లో హింసాత్మకంగా మారింది. ఇప్పుడు కూడా అదే సా-ధయిలో వేలాది మంది రైతులు పంజాబ్ నుంచి ఢిల్లీకి వస్తున్నారు. అటు హరియాణా

మిగతా 3వ పేజీలో...



# సోనియా నామినేషన్

**జైపూర్, ప్రభాతసూర్యుడు :** కాంగ్రెస్ రాజ్యసభ ఎన్నికలకు సిద్ధమైంది. ఇప్పటికే నలుగురు అభ్యర్థులను ప్రకటించింది. ఈ జాబితాలో సోనియా గాంధీ కూడా ఉన్నారు. ఆమె తెలంగాణలో లోక్‌సభకు పోటీ చేస్తారన్న వార్తలు వచ్చినా...ఆమె రాజ్యసభకు పోటీ చేస్తున్నట్టు కాంగ్రెస్ ప్రకటించింది. రాజస్థాన్ నుంచి సోనియా బరిలోకి దిగుతున్నారు. ఆమెతో పాటు బిహార్ నుంచి డాక్టర్ అఖిలేష్ ప్రసాద్ సింగ్, హిమాచల్ ప్రదేశ్ నుంచి శ్రీ అభిషేక్ మను సింఘ్వీ, మహారాష్ట్ర నుంచి చంద్రకాంత్ హండోర్‌ని అభ్యర్థులుగా ప్రకటించారు. త్వరలోనే తెలంగాణ నుంచి అభ్యర్థులను ప్రకటించే అవకాశాలున్నాయి. సోనియా గాంధీ ఇప్పటికే రాజస్థాన్ నుంచి నామినేషన్ వేశారు. జైపూర్ నుంచి ఆమె నామినేషన్ వేసినట్టు ప్రకటించారు. ఈ సమయంలో

మిగతా 2వ పేజీలో...

# కేటీఆర్... అహంకారం తగ్గించుకో



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** కేటీఆర్.. మంత్రి పొన్నం మాట్లాడుతుంటే కూర్చో అంటాడు..ఎంత అహంకారం.. కేటీఆర్ బుద్ధి మార్చుకో అంటూ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఎలా ఉన్నారో.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా మారలేదన్నారు. కడియం మొన్న నేను మంత్రివి కావు కూర్చో అన్నాడు.. మంత్రి పదవి..మా పార్టీ చూసుకుంటారు.. అని తెలిపారు. ఉద్యమ కారుడు రాజయ్యకి అన్యాయం చేసింది నువ్వు అంటూ మండిపడ్డారు. డిప్యూటీ సీఎం పదవి లాక్కున్నావన్నారు. అవమానకరంగా మంత్రి పదవి తీయించుకున్న చరిత్ర మీది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి కావాలని.. ఎమ్మెల్యే వదిలేసి.. ఎమ్మెల్యే సీటు కోసం రాజయ్యకి

మిగతా 3వ పేజీలో...


## బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా ఏలేటీ మహేశ్వరరెడ్డి



**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :** బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా ఏలేటీ మహేశ్వరరెడ్డిని ఆ పార్టీ హై కమాండ్ బుధవారం నాడు అధికారికంగా ప్రకటించింది. ఫ్లోర్ లీడర్‌తో పాటు మిగతా సభ్యులను కూడా అధిష్ఠానం నియమించింది. డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా పాయల్ శంకర్, చీఫ్ విప్‌గా పాల్వాయి హరీష్ బాబు, విప్‌గా ధన్ పాల్ సూర్యనారాయణ, ట్రెజరర్‌గా పైడి రాకేష్ రెడ్డి, ఆఫీస్ సెక్రటరీగా రామారావు పాటిల్‌ను బీజేపీ హై కమాండ్ నియమించింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కమలం పార్టీ 8 సీట్లను గెలుచుకున్న విషయం తెలిసిందే.కాగా.. ఏలేటి మహేశ్వర రెడ్డి నిర్మల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2009లో ఆయన ప్రజారాజ్యం పార్టీలో ఎమ్మెల్యేగా పనిచేశారు.

# కడియం, పొన్నం.. మాటకు మాట!

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** : తెలంగాణలో అసెంబ్లీ సమావేశాలు వాడీవేడిగా సాగుతున్నాయి. తొలి సమావేశంలోనే అధికార, ప్రతిపక్షాలు ఒకరిపై ఒకరు విమర్శన బాణాలు సంధించుకోగా...



బడ్జెట్ సమా వేశాల్లో మరింత వాడీగా దాడులు సాగుతున్నాయి. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ఇరు పక్షాలు దూకుడు పెంచాయి. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తా మని హామీ ఇచ్చి ఎన్నికల్లో నెగ్గిన కాంగ్రెస్ వాటి అమలుపై కనీసం దృష్టి సారించలేదని బీఆర్ఎస్ విమర్శించింది. బడ్జెట్ పై చర్చ సందర్భంగా మాజీ మంత్రి కడియం శ్రీహరి ఆరు గ్యారెంటీల అమలుపై ప్రభుత్వానికి ప్రశ్నలు సంధించారు. ఆరు గ్యారెంటీలతోపాటు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన డిక్లరేషన్లు అమలు చేయాలంటే లక్షా 36వేల కోట్లు కావాలని.... కానీ కాంగ్రెస్ అందులో సగం కూడా



బడ్జెట్ లో కేటాయించలేదని మండిపడ్డారు. కేవలం 53వేల కోట్లు మాత్రమే కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని దుయ్యబట్టారు. శ్రీహరి వ్యాఖ్యలకు మంత్రి శ్రీధర్ బాబుకౌంటర్ ఇచ్చారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి పట్టుమని రెండు నెలలు కూడా కాలేదని....అప్పుడే ఎదురుదాడులు, ఉద్యమాలు ప్రారంభిస్తే ఎలా అంటూ చురకలు వేశారు. ఇచ్చిన హామీలపై వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్న శ్రీధర్ బాబు.. .పథకాలు అమలు

మిగతా 3వ పేజీలో...



## రామగుండం మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం

**పెద్దపల్లి - ప్రభాతసూర్యుడు :** పెద్దపల్లి జిల్లా రామగుండం మెడికల్ కాలేజీ బాయ్స్ హాస్టల్లో జూనియర్ మెడికో స్టూడెంట్ ను సీనియర్లు కొందరు ర్యాగింగ్ చేయడం కలకలం సృష్టించింది. ఈ సంఘటనపై హాస్టల్లో గొడవ జరగడంతో పోలీసులు వెళ్లి విచారణ జరిపారు. జూనియర్ మెడికో తల వెంట్రుకలు, మీసాలను ట్రిమ్మర్ తో ఇష్టానుసారంగా కట్ చేసి, ర్యాగింగ్ చేసినట్లు సమాచారం. దీనిపై సదరు స్టూడెంట్ కుటుంబ సభ్యులు కాలేజ్ ప్రిన్సిపల్ కు ఫిర్యాదు చేశారు. అయితే కాలేజీ ర్యాగింగ్ నిరోధక కమిటీ ఆధ్వర్యంలో మెడికో విద్యార్థులు, పోలీసుల మధ్య రహస్యంగా మీటింగ్ జరుగుతున్నట్లు తెలిసింది. కొందరు జూనియర్ విద్యార్థులు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ హిమబిందు సింగ్ కు ఫిర్యాదు చేసినట్లు, విచారణ అనంతరం రుజువైతే తగిన చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపల్ అంటున్నారు. కాగా ఈ సంఘటన జిల్లా వ్యాప్తంగా సంచలనం రేపుతుంది.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com




# నేడు మండలానికి ఎమ్మెల్యే వీరేశం రాక

**రామన్నపేట - ప్రభాత సూర్యుడు :** నకిరేకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే వేముల వీరేశం నేడు రామన్నపేట మండలంలో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా రామన్నపేట, సిరిపురం, వెల్లంకి గ్రామాలలో పర్యటించి, సిసి రోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని మల్లారెడ్డి కోరారు.

# రేపటి బంద్‌ను జయప్రదం చేయండి

- పంచాయతీ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గ్యార పాండు
- సిఐటియు మండల కన్వీనర్ పోచమోని కృష్ణ



**మంచాల - ప్రభాత సూర్యుడు :** కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 16 న జరిగే గ్రామీణ బంద్ ను జయప్రదం చేయాలని సీఐటీయూ, ప్రజా సంఘాల అధ్వర్యం లో లోయపల్లి గ్రామంలో బుధవారం ఇంటింటికీ కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గ్యార పాండు , పోచ మోని కృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మిక చట్టాలను కాలరాసిందని విమర్శించారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను 4 లేబర్ కొర్డులగా మార్చి కార్మికులకు వున్న హక్కులను హరిస్తుందని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో పనిచేసే ఏ కార్మికునికైన 26 వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు చెప్పినా వేతనాలను అమలు చేయడం లేదని విమర్శించారు. నూతన వ్యవసాయ నల్ల చట్టాలను తెచ్చి కార్పోరేట్ శక్తులకు అప్ప చెప్పడం కోసం పూనుకుంటే ఢిల్లీ సరిహద్దుల్లో ఏడాది పాటు రైతాంగం పెద్ద ఎత్తున ధర్నాలు రాస్తారోకోలు చేయడం జరిగింది. ఈ పోరాటంలో 600 మంది రైతులు చనిపోయినా మొక్క వోని పోరాటంతో ప్రభుత్వం దిగివచ్చి తాత్కాలికంగా వాయిదా వేసింది తప్ప పూర్తిగా రద్దు చేయనందున ప్రమాదం పొంచి వుందని అన్నారు. ఉపాధి హామీ చట్టం తీసి వేయడం కోసం చట్టంలో అనేక మార్పులు తెచ్చి వ్యవసాయ కూలీలకు ఉపాధి లేకుండా చేయడం కోసం ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయాలని చూస్తుందని అన్నారు. పేదలకు ఇచ్చిన వాగ్దానాలను అమలుచేయడం లో కేంద్ర బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని చెప్పారు. పేదల పైనా మోయలేని భారాలు వేసి వారి బ్రతుకులతో చెలగాటం ఆడుతున్నారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల పైన ఈ నెల 16న జరిగే సమ్మె గ్రామీణ బంద్ లో ప్రజలు కార్మికులు, రైతులు, కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బోయపల్లి సుధాకర్, డి వై ఎఫ్ ఐ జిల్లా మాజీ కార్యదర్శి గంపల్లి రాజు, సీఐటీయూ ప్రజా సంఘాల నాయకులు కార్మికులు కృష్ణ, కుమార్, సాలమ్మ , పద్మమ్మ,రాములమ్మ, అంజమ్మ,సరోజ,రవి, రమేష్,బాబీ, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కుల పరిరక్షణకే 16న బంద్



## రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి

**యాచారం - ప్రభాత సూర్యుడు :** బిజెపి కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించి ప్రజలు వాడుకుంటున్న నిత్యవసర ధరలు తగ్గించాలని కార్మిక కర్షక ఉపాధి హామీ చట్టంరక్షణ కై ఈ నెల 16న జరిగే దేశ వ్యాప్తంగా గ్రామీణ బంద్ జయప్రదం చేయాలని యాచారం మండలం కొత్తపల్లి గ్రామంలో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి మధుసూదన్ రెడ్డి ,వ్యకాస జిల్లా అధ్యక్షులు పి అంజయ్య, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఆల్లంపల్లి నరసింహ మాట్లడుతూ గతంలో గ్యాస్ 350రూ వుంటే రోడ్లు ఎక్కిగగ్గోలు పెట్టిన బిజెపి ఇ ప్పుడు 1200 రూపాయలు పెంచి ప్రజల పైనా భారాల మీద భారాలు మోపింది. పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడం వలన నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అందే విధంగా పెద్ద ఎత్తున ప్రజలమీద భారం మోపింది కాకులను కొట్టి గద్దలకు వేసినట్లు ప్రజల సంపదను కార్పోరేట్ శక్తులైన అంబాని అదానిలకు దోషిపెడ్తు ప్రజలను బికారులుగా చేస్తోంది. బిజెపి ప్రభుత్వం మరోపక్క ప్రభుత్వా రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తు కార్మికులకు ఉన్న హక్కులను కలారాస్తుంది . పేదలకు ఉపయోగ పడతున్న ఉపాధి హామీ చట్టం తీసి వేసే కుట్ర జరుగుతుంది గతంలో ఇచ్చిన వాగ్దానాలను అమలుచే యకుండ మరపించ్చి మళ్ళి ఎన్నికలల్లో గెలువడం కోసం రాముని పేరుతో ఇల్లు ఇల్లు తిరిగి ప్రజలను మోసం చేస్తున్నారు . ఇంకా బిజెపి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక మతోన్మాదా విధానాలకు వ్యతిరేకంగా 16 న జరిగే దేశ వ్యాప్తంగా జరిగే గ్రామీణ బంద్ జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ యాచారం మండల అధ్యక్షులు కావలి జగన్, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పోలే శివ, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు కంబాలపల్లి విప్లవ్ కుమార్, ప్రజా సంఘాల నాయకులు గుడ్ల జంగయ్య, కంబాలపల్లి కృష్ణ, డివైఎఫ్ఐ గ్రామ కార్యదర్శి కంబాలపల్లి సైదులు, నోముల మొగులయ్య , యాదయ్య, సామెల్, తదితరులు పాల్గొన్నారు.

# సోనియా నామినేషన్

మొదటిపేజీ తరువాయి..

సోనియాతో పాటు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఉన్నారు. 1998 నుంచి 2022 వరకూ సోనియా గాంధీ కాంగ్రెస్ ప్రెసిడెంట్ బాధ్యతలు చేపట్టారు. ఐదు సార్లు లోక్‌సభ ఎంపీగా గెలిచారు. ఫిబ్రవరి 27వ తేదీన మొత్తం 56 సీట్లకు రాజ్యసభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌తో మన్మోహన్ సింగ్, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా రాజ్యసభ సభ్యత్వ గడువు ముగిసిపోనుంది. వీరితో పాటు మరో 9 మంది కేంద్రమంత్రుల సభ్యత్వమూ ముగిసిపోతుంది. వీళ్లలో అశ్వినీ వైష్ణవ్, ధర్మేంద్ర ప్రదాన్, భూపేంద్ర యాదవ్, మన్‌సుఖ్ మాండవీయ ఉన్నారు.

# పెట్టుబడికి కట్టుబాట్లు..

మొదటిపేజీ తరువాయి..

రూ.7 వేల కోట్లు ఆదా అవుతాయని ప్రభుత్వ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా రైతు బంధు ఇచ్చిందని రేవంత్ సర్కార్ ఆరోపణలు చేసింది. కొండలు, గుట్టలకు కూడా కేసీఆర్ రైతు బంధు ఇచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో జరిగిన చిట్ చాట్ లో అన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలను సరి చేస్తామని సీఎం రేవంత్ తెలిపారు. తెలంగాణలో కొత్త ప్రభుత్వం కొలువు దీరింది.. ఇచ్చిన హామీలను నెరవేరుస్తుంది.. తమ కష్టాలు తీరుతాయని అనుకున్న రైతుల ఆశలు ఆవిరి అయ్యాయి. దీనికి కారణం రైతు బంధు నిధులు ఇంకా తమ ఖాతాలో జమ కాకపోవడమే. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు భరోసా కింద ఎకరాకు రూ.15,000 ఆర్థిక సాయాన్ని అందిస్తామన్న కాంగ్రెస్ పార్టీ.. గత ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసిందని, ఈ



దఫా పాత పద్దతిలోనే రైతు బంధు ఇస్తామని ప్రకటించింది. అయితే? నెలలు గడుస్తున్నా తమ ఖాతాలో రైతు బంధు సాయం ఇంకా జమ కాకపోవడంతో పెట్టుబడి సాయం కోసం దళారుల దగ్గర అప్పు చేస్తున్నారు. ఇగో పడుతాయి.. అగో పడుతాయి అని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ.. తమ పొట్ట కొట్టిందని వాపోతున్నారు రైతులు. ఇప్పటికే 2 ఎకరాల్లోపు రైతులకు రైతు బంధు నిధులు జమ చేసినట్లు అధికారిక వర్గాలు చెబుతున్నాయి.



# అబ్దుల్లాపూర్‌మెట్ ఎంపీడీవోగా శ్రీవాణి

**అబ్దుల్లాపూర్‌మెట్ - ప్రభాత సూర్యుడు :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం ఎంపీడీవోగా యు.శ్రీవాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం ఎంపీడీవోగా విధులు నిర్వహించిన శ్రీవాణి అబ్దుల్లాపూర్ మెట్‌కు సాధారణ బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన మమతా బాయ్ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా శామీర్ పేట్ మండలానికి బదిలీపై వెళ్లారు.



# రామన్నపేట ఎంపీడీవోగా భూక్య యాకూబ్

**రామన్నపేట - ప్రభాత సూర్యుడు :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఎంపీడీవో గా భూక్య యాకూబ్ నాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చండూరు మండలం ఎంపీడీవోగా విధులు నిర్వహించిన భూక్య యాకూబ్ నాయక్ రామన్నపేటకు సాధారణ బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన జలంధర్ రెడ్డి జనగామ కు బదిలీపై వెళ్లారు.

# 'కృష్ణా'వతారం!

మొదటిపేజీ తరువాయి..

నిరూపించాలనుకుంటున్నారు. కేసీఆర్ అంటే తెలంగాణ ప్రజలకు ఒకే రూపం గుర్తుకు వస్తుంది. అదే నిఖార్సైన తెలంగాణ ఉద్యమ రూపం. తెలంగాణ కొట్లాడిన స్వరూపం కనిపిస్తుంది. అదే ఆయనకు రాజకీయ కవచ కుండలంగా మారింది. కేసీఆర్ నేల విడిచి సాము చేశారో... ఆకాశానికి నిచ్చెనలు వేసే ప్రయత్నం చేశారో కానీ ఆ తెలంగాణకు దూరమయ్యే ప్రయత్నం చేయడంతో ఓటమి మిగిలింది. బీఆర్ఎస్ పార్టీకి ప్రత్యేకమైన ఓటు బ్యాంక్ లేదు. కులం బలం లేదు. మతం బలం లేదు. ఉన్నదల్లా ప్రాంతీయ సెంటిమెంట్ మాత్రమే . కారణం ఏదైతేనే కేసీఆర్ తన తెలంగాణ సెంటిమెంట్ బలాన్ని వదిలేసుకుని జాతీయ వాద రాజకీయాలు చేయాలనుకున్నారు. అది ఎంత తప్పో ఇప్పుడు తెలిసి వచ్చింది. అసలుకే మోసం వచ్చే పరిస్థితి ఏర్పడటంతో వేగంగా తప్పు దిద్దుకునేందుకు ప్రయత్నిస్తున్నారు దానిలో భాగంగానే కృష్ణా ప్రాజెక్టులు .. కేఆర్ఎంబీకి అప్పగించడంపై ఉద్యమం ప్రారంభమయింది. మొదటి సారిగా నల్లగొండ సభతో ప్రజల ముందుకు వచ్చారు. పార్లమెంట్ ఎన్నికలు ఇప్పుడు కేసీఆర్‌కు అత్యంత ముఖ్యం. ఆరేడు పార్లమెంట్ సీట్లు గెల్చుకోకపోతే తర్వాత పార్టీ నేతల్ని..క్యాడర్ ను..అంతిమంగా పార్టీని కాపాడుకోవడం కష్టం. ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా పార్టీని నిర్వీర్యం చేయడానికి రెండు జాతీయ పార్టీలు ప్రయత్నిస్తాయి. ఆ విషయం కేసీఆర్‌కు తెలియనిదేం కాదు. ఇప్పటికిప్పుడు పార్టీని కాపాడుకోవాలంటే మళ్లీ తెలంగాణ సెంటిమెంట్ తప్ప మరో ఆయుధం కేసీఆర్ వద్ద లేదు. అందుకే మళ్లీ అందుకోవాలని డిసైడయ్యారు. తాను వదిలేసిన సెంటిమెంట్ అస్త్రం కోసం పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఆఖరి ప్రయత్నం చేస్తున్నారు. దక్షిణ తెలంగాణలో బీఆర్ఎస్ పూర్తిగా దెబ్బతిన్నది. ప్రస్తుత కృష్ణా ప్రాజెక్టుల వివాదం కూడా పూర్తిగా దక్షిణ తెలంగాణపై ఆ?ధారపడి ఉంది. ఈ క్రమంలో ప్రాజెక్టుల అంశంతో ప్రజల్లో మరోసారి సెంటిమెంట్ రేపి.. పార్టీని బతికించుకోవాలని గట్టి ప్రయత్నం చేసన్నారు. తన ప్రయత్నాలు ప్రారంభించారు. ప్రాజెక్టులు కేంద్రం చేతుల్లోకి వెళ్లిపోయానని.. ఇక తెలంగాణకు ఒక్క చుక్క నీరు రాదని బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్తగా ఎలాంటి మార్పులు జరగలేదు. గతంలో పదేళ్ల పాటు బీఆర్ఎస్ హయాంలోనే ఉన్నట్లుగా ఉన్నాయి. ఎన్నికల రోజున ఏపీ ప్రభుత్వం సాగర్ ప్రాజెక్టును ఆక్రమించిన అంశంలో.. చెలరేగిన వివాదంతో మరోసారి అలాంటి పరిస్థితి ఏర్పడకుండా భద్రత ఏర్పాటు చేశారు. ఇరు రాష్ట్రాలకు వాటా ఉన్నా శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులు కేఆర్ఎంబీ పరిధిలో ఉంటాయి తప్ప.. ఇతర ప్రాజెక్టులు ఉండవు. వివాదం లేని ప్రాజెక్టులు కేఆర్ఎంబీ అధీనంలో ఉండవు. కానీ కేఆర్ఎంబీ పేరుతో అంది వచ్చిన అవకాశాన్ని వదులుకునేందుకు కేసీఆర్ సిద్ధంగా లేరు. అందుకే అసెంబ్లీకి వెళ్లకపోయినా.. అక్కడ తన వాదన వినిపించకపోయినా సమస్య లేదని.. ప్రజల ముందే తాను చెప్పాలనుకున్నది చెప్పాలనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. అంటే తెలంగాణ నీటి ప్రయోజనాల పేరుతో నల్లగొండలో కేసీఆర్ నిర్వహించిన బహిరంగసభ పార్లమెంట్ ఎన్నికల ప్రచార భేరీకి ప్రారంభసభ అనుకోవచ్చు. దాన్ని ప్రాజెక్టుల సభగా చేసి.. తన పాత అస్త్రం తెలంగాణ సెంటిమెంట్ ను మళ్లీ పొందాలనుకుంటున్నారు. తెలంగాణ అంటే కేసీఆర్.. తనను కాదని వేరే పార్టీని ప్రజలు ఎన్నుకోరన్న నమ్మకంతో .. పార్టీని టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్ గా మార్చి జాతీయ రాజకీయాలపై ఎక్కువ దృష్టి పెట్టారు. చివరికి తెలంగాణలో గ్రౌండ్ కోల్పోవడంతో సర్వం కోల్పోయినట్లయింది. ఇప్పుడు మళ్లీ మూలలకు వచ్చి .. తన ఆయుధాన్ని వెదుక్కుంటున్నారు. ఇప్పుడు మళ్లీ కేసీఆర్ చెప్పే మాటల్ని విని ప్రజలు భావోద్వేగానికి గురవుతారా లేదా అన్నదానిపైనే ఆయన రాజకీయ భవితవ్యం ఆధారపడి ఉంది. నిజానికి కేసీఆర్ ఓడిపోయి రెండు నెలలు కూడా కాలేదు. ఈ లోపే తెలంగాణకు ఏదో జరిగిపోతోందని ప్రజల్ని నమ్మించడం అంత తేలిక కాదు. కానీ కేసీఆర్ కు మరో ఆప్షన్ లేదు. అందుకే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలాంటి విషయాల్లో కేసీఆర్ చేసే రాజకీయం ఎవరూ ఊహించని విధంగా ఉంటుంది. కానీ ప్రజలు ఎలా స్పందిస్తారన్నదానిపైనే అసలు విజయం ఆధారపడి ఉంటుంది. నల్లగొండ సభపై ప్రజల అభిప్రాయం ఎలా ఉంటుందో.. దాన్ని బట్టి కేసీఆర్ ప్రయత్నాలు వర్కవుట్ అవుతాయా లేదా అన్నది అంచనా వేసుకోవచ్చు. ఈ విషయంలో బీఆర్ఎస్ నేతలు అంత సంతృప్తిగా ఉన్నట్లుగా కనిపించడం లేదు.





మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న జాంబవ మహాసేన కమిటీ సభ్యులు

# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

**రామన్నపేట - ప్రభాత సూర్యుడు :** అనారోగ్యంతో మరణించిన నిరుపేద కుటుంబానికి జాంబవ మహాసేన కమిటీ అండగా నిలబడింది. మండల పరిధిలోని నీర్నేముల గ్రామానికి చెందిన నోముల లింగమ్మ గత వారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న మృతురాలి కుటుంబ సభ్యులకు అండగా 13,200/- రూపాయల ఆర్థిక సహాయాన్ని జాంబవ మహాసేన కమిటీ సభ్యులు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు జాంబవ మహాసేన ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాంబవ మహాసేన కమిటీ సభ్యులు నోముల యాదగిరి, నోముల ప్రవీణ్, నోముల శంకరయ్య, సుదర్శన్, నోముల వంశీ, చిప్పలపల్లి రవి, నోముల లింగయ్య, నోముల నరసింహ, చిప్పలపల్లి లక్ష్మయ్య, నోముల ప్రతాప, నోముల శంకరయ్య, నోముల కృష్ణ, నోముల రాములు, నోముల పెద్ద రాములు, నోముల మురళి పాల్గొన్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## స్కూల్ లో క్షుద్రపూజలు..

**ఆందోళనలో విద్యార్థులు, తల్లితండ్రులు**



జగిత్యాల- ప్రభాతసూర్యుడు : భీమారం మండలం మన్నెగూడెం లో కలకలం రేగింది. స్థానిక హై స్కూల్ లో ప్రధానోపాధ్యాయుడి ఆఫీస్ ముందర కొడుగ్రుడ్డు నిమ్మకాయలతో ముగ్గు వేసి బ్లాక్ మ్యాజిక్ చేసి వెళ్లారు కొందరు గుర్తు తెలియని వ్యక్తులు...ఇది నిజంగా కావాలనే చేశారా...లేక ఆకతాయిల పనా అని స్థానిక పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## 20 లక్షల కోట్లు దాటిన రిలయన్స్


ముంబై, ప్రభాతసూర్యుడు : దేశీ వ్యాపార సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ మరో అరుదైన రికార్డు సొంతం చేసుకుంది. రిలయన్స్ మార్కెట్ విలువ రూ.20 లక్షల కోట్ల మార్కును దాటింది. ఈ రికార్డును సొంతం చేసుకున్న తొలి దేశీయ కంపెనీగా రికార్డు సృష్టించింది. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ముఖేష్ అంబానీ కంపెనీ షేర్లు 14 శాతం మేర పుంజుకుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ స్టాక్ బీఎస్ఈలో రూ. 2,957 వద్ద సరికొత్త రికార్డును తాకింది. దీంతో ఫిబ్రవరి 13న ఇంట్రాడేలో రిలయన్స్ మార్కెట్ విలువ 1.8 శాతం పెరిగింది. 2005 ఆగస్టులో రిలయన్స్ మార్కెట్ విలువ రూ. 1 లక్ష కోట్లకు చేరుకుంది. ఏప్రిల్ 2007లో రూ. 2 లక్షల కోట్లకు, సెప్టెంబర్ 2007లో రూ. 3 లక్షల కోట్లకు, అక్టోబర్ 2007లో రూ. 4 లక్షల కోట్లకు చేరుకుంది. జూలై 2017లో రూ. 5 లక్షల కోట్లకు చేరుకోవడానికి రిలయన్స్ కంపెనీకి 12 ఏళ్లు పట్టింది. నవంబర్ 2019లో కంపెనీ మార్కెట్ విలువ రూ. 10 లక్షల కోట్లకు, సెప్టెంబర్ 2021లో రూ. 15 లక్షల కోట్లకు చేరుకుంది. ఇక జనవరి 2024లో రిలయన్స్ ఇండస్ట్రీ లిమిటెడ్ స్టాక్ విలువ 10.4 శాతం నుంచి పైపైకి పెరగడం ప్రారంభించింది.

ఈ ఏడాది జనవరి 29 నాటికి కంపెనీ మార్కెట్ విలువ రూ.19 లక్షల కోట్లకు చేరుకుంది. ఫిబ్రవరిలో దాదాపు 4 శాతం పెరిగింది. కేవలం 600 రోజుల్లో రూ.5 లక్షల కోట్లు విలువ కూడదీసుకుంది. ఈ క్రమంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు సోమవారం రూ.2,904 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 11.16 గంటలకు 1.8 శాతం మేర లాభంతో రూ.2,953 వద్ద ట్రేడయ్యింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.20 లక్షల కోట్లు దాటింది. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో 1.26 శాతం లాభంతో రూ.2941 వద్ద ట్రేడ్ అయ్యింది. మధ్యాహ్నం 2.19 గంటలకు ఈ షేరు గత ముగింపుతో పోలిస్తే 0.76 శాతం మేర పెరిగి రూ.2,925 వద్ద ట్రేడయ్యింది. దీంతో ఈ రోజు రిలయన్స్‌కు బాగా కలిసొచ్చినట్లైంది.

# బాబుమోహన్ దారి ఎటువైపు?

- 1998 బైఎలక్షన్లలో తొలిసారి ఎమ్మెల్యేగా విజయం
- 1999లో టీడీపీ సర్కారులో మంత్రి పదవి
- 2014లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలుపు
- ఇప్పటికి మూడుసార్లు అసెంబ్లీకి ఎన్నిక
- 2018లో బీజేపీలో చేరిన సినీ నటుడు
- తాజాగా కాషాయానికి రాజీనామా

మెదక్, ప్రభాతసూర్యుడు : దోల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున తొలిసారి గెలిచారు బాబూమోహన్. 1998 ఉప ఎన్నికల్లో పోటీ చేసి ఎమ్మెల్యే అయ్యారాయన. తర్వాత 1999లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ నుంచే రెండోసారి గెలిచి ఉమ్మడి రాష్ట్రంలో కార్మికశాఖ మంత్రిగా పని చేశారు. ఇక 2014లో గులాబీ కండువా కప్పుకుని మూడోసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు బాబూమోహన్. 2018లో బీఆర్ఎస్ టికెట్ రాకపోవడంతో కాషాయంలోకి జంప్ కొట్టారాయన. కమలం పార్టీ తరపున పోటీ నాడు ఘోరంగా ఓడిపోయారు మాజీ మంత్రి. ఇక తాజా అసెంబ్లీ ఎన్నికల్లోనూ అందోల్ నుంచి మరోసారి ఓటమి తప్పలేదు బాబూమోహన్‌కు. ఆ ఓటమితో కొన్నాళ్ళు సైలెంట్‌గా సైడైపోయిన మాజీ మంత్రి.. ఈసారి బీజేపీ ఎంపీ టిక్కెట్ ఆశిస్తున్నారట. ఆ మాట వినగానే పార్టీ పెద్దలు నిర్మొహమాటంగా నో చెప్పేయడంతో హర్ట్ అయిన బాబుమోహన్.. కాషాయ కండువా తీసి పక్కన పడేశారు. బీజేపీతో బంధం తెగిపోయిందని ప్రెస్ మీట్ పెట్టి మరీ క్లారిటీ ఇచ్చేశారు బాబుమోహన్. దీంతో ఇప్పుడు ఆయనఏ గూటి పక్షి అనవుతారోనన్న చర్చ జరుగుతోంది రాజకీయవర్గాల్లో. వాస్తవంగా బాబూమోహన్ బీజేపీపై ఎప్పటి నుంచో అసంతృప్తిగా ఉన్నారట. అసెంబ్లీ ఎన్నికల సమయం లోనూ ఆందోల్ బీజేపీ టికెట్ కోసం బాబుమోహన్ కి ఆయన కొడుకు ఉదయ్‌కి కోల్డ్ వార్ నడిచింది. అలాగే తనకు థర్డ్ లిస్ట్‌లో టిక్కెట్ ఇవ్వడాన్ని కూడా అవమానంగా ఫీలయ్యారట. ఒకవైపు బీజేపీ అధిష్టానం ఆయనకు ఆలస్యంగా టికెట్ ఇవ్వడం, అదే సమయంలో అనూహ్యంగా ఆయన కుమారుడు బీజేపీకి గుడ్ బై చెప్పి.. బీఆర్ఎస్‌లో చేరడంతో నాడు ఏం చేయాలో పలుపోలేదట బాబూమోహన్‌కు. తనను రాజకీయంగా దెబ్బకొట్టేందుకు ప్రత్యర్థులు పన్నిన పన్నాగంలో తన కుమారుడు చిక్కుకున్నాడంటూ అప్పట్లో కన్నీళ్లు కూడా పెట్టుకున్నారాయన. అలాగే బీజేపీలో వర్గ విభేదాలు ఉన్నాయని.. పార్టీ రాష్ట్ర నాయకత్వం తన విషయంలో అంత సానుకూలంగా లేదని కూడా అన్నారు. ఈ పరిణామ క్రమంలోనే బీజేపీకి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్టు తాజాగా వెల్లడించారు మాజీ మంత్రి. పార్లమెంట్ ఎన్నికల సమయంలో బాబూ మోహన్ బీజేపీకి బై బై చెప్పడం జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో పార్టీకి ఎంత వరకు నష్టమన్న లెక్కలు తెరమీదికి వస్తున్నాయి. అటు ఆయన తీసుకోబోయే నిర్ణయం ఎలా ఉంటుందన్న ఉత్కంఠ కూడా పెరుగుతోంది. ఈసారి వరంగల్ ఎంపీగా పోటీ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారట ఆయన. అది ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం కాబట్టి టిక్కెట్ కోసం కాంగ్రెస్, ఃఖీలను సంప్రదిస్తారన్న ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ సిట్టింగ్‌కు మరోసారి అవకాశం లేదన్న ప్రచారంతో ఆ దిశగా గట్టి ప్రయత్నం చేస్తున్నట్టు తెలిసింది. మరో వైపు ఆందోల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయిన దామోదర రాజనర్సింహ, బాబు మోహన్ రాజ కీయంగా విరోధులు అయినా మంచి సంబంధాలు ఉన్నాయట. దీంతో కాంగ్రెస్ లో చేరుతారన్న ప్రచారం కూడా ఉంది. ఈ పరిస్థితల్లో బాబూమోహన్ తదుపరి అడుగులు ఎటువైపు పడతాయో చూడాలి.





# రాజ్యసభ బరిలో నడ్డా

గాంధీనగర్ - ప్రభాతసూర్యుడు : రాజ్యసభ ఎన్నికల అభ్యర్థులను ప్రకటించింది బీజేపీ. గుజరాత్ నుంచి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను బరిలోకి దింపింది. మహారాష్ట్రలో ఊహించిందే జరిగింది. ఇటీవలే కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చిన మాజీ సీఎం, సీనియర్ నేత అశోక్ చవాన్‌కి అవకాశమిచ్చింది. జేపీ నడ్డా ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్ రాజ్యసభ ఎంపీగా ఉన్నారు. అయితే....అక్కడ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. అక్కడ జేపీ నడ్డాని నిలబెడితే గెలిచే అవకాశముండదని భావించిన హైకమాండ్..ఆయనను గుజరాత్ నుంచి బరిలోకి దింపాలని నిర్ణయించుకుంది. అటు అశోక్ చవాన్ కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి బీజేపీలో చేరిన వెంటనే ఆయనకు రాజ్యసభ టికెట్ ప్రకటించింది అధిష్ఠానం. మహారాష్ట్రలో కాంగ్రెస్‌కి షాక్‌ల మీద షాక్‌లు తగిలాయి. అశోక్ చవాన్ కన్నా ముందు బాబా సిద్దిఖీ, మిలింద్ దియోర ఆ పార్టీ నుంచి బయటకు వచ్చేశారు. సిద్దిఖీ అజిత్ పవార్ ఔఅఖలో చేరారు. దియోర ఏక్‌నాథ్ శిందే వర్గమైన శివసేన పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సారి విడుదల చేసిన జాబితాలో గుజరాత్ నుంచి నలుగురు, మహారాష్ట్ర నుంచి ముగ్గురు అభ్యర్థులను ప్రకటించింది బీజేపీ. గుజరాత్‌లో జేపీ నడ్డాతో పాటు గోవింద్ భాయ్ ధోలాకియా, మయంక్‌భాయ్ నాయక్, డాక్టర్ జశ్వంత్‌సిన్హ్ పర్మర్‌కి అకాశమిచ్చింది. అటు మహారాష్ట్రలో అశోక్ చవాన్‌తో పాటు మేధా కులకర్ణి, డాక్టర్ అజిత్ గోప్‌చద్దేలను అభ్యర్థులుగా ప్రకటించింది. కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ని ఒడిశా నుంచి బరిలోకి దింపనుంది బీజేపీ. కాంగ్రెస్ రాజ్యసభ ఎన్నికలకు సిద్ధమైంది. ఇప్పటికే నలుగురు అభ్యర్థులను ప్రకటించింది. ఈ జాబితాలో సోనియా గాంధీ కూడా ఉన్నారు. ఆమె తెలంగాణలో లోక్‌సభకు పోటీ చేస్తారన్న వార్తలు వచ్చినా...ఆమె రాజ్యసభకు పోటీ చేస్తున్నట్టు కాంగ్రెస్ ప్రకటించింది. రాజస్థాన్ నుంచి సోనియా బరిలోకి దిగుతున్నారు. ఆమెతో పాటు బిహార్ నుంచి డాక్టర్ అఖిలేష్ ప్రసాద్ సింగ్, హిమాచల్ ప్రదేశ్ నుంచి శ్రీ అభిషేక్ మను సింఘ్వీ, మహారాష్ట్ర నుంచి చంద్రకాంత్ హండోర్‌ని అభ్యర్థులుగా ప్రకటించారు. త్వరలోనే తెలంగాణ నుంచి అభ్యర్థులను ప్రకటించే అవకాశాలున్నాయి. సోనియా గాంధీ ఇప్పటికే రాజస్థాన్ నుంచి నామినేషన్ వేశారు. జైపూర్ నుంచి ఆమె నామినేషన్ వేసినట్టు ప్రకటించారు. ఈ సమయంలో సోనియాతో పాటు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఉన్నారు. 1998 నుంచి 2022 వరకూ సోనియా గాంధీ కాంగ్రెస్ ప్రెసిడెంట్ బాధ్యతలు చేపట్టారు. ఐదు సార్లు లోక్‌సభ ఎంపీగా గెలిచారు. ఫిబ్రవరి 8వ తేదీనే నామినేషన్ ప్రక్రియ మొదలైంది. ఫిబ్రవరి 15వ తేదీతో నామినేషన్‌ల స్వీకరణ గడువు ముగిసిపోతుంది. నామినేషన్ల ఉపసంహరణకు ఫిబ్రవరి 20 ఆఖరు తేదీ. ఫిబ్రవరి 27వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఈ ఓటింగ్ కొనసాగుతుంది.

# కడియం, పొన్నం.. మాటకు మాట!

మొదటిపేజీ తరువాయి..

చేసేందుక క్షేత్రస్థాయిలో కసరత్తు జరుగుతోందన్నారు. ఇప్పటికే రెండు హామీలు దిగ్విజయంగా అమలు చేశామని గుర్తుచేశారు, మరో రెండు హామీలు త్వరలోనే అమలు చేయనున్నట్లు తెలిపారు. కనీసం వాస్తవ పరిస్థితులు తెలుసుకోకుండా హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను నమ్మించిందని కడియం శ్రీహరి విమర్శించారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల నెత్తిపై భస్మాసుర హస్తం పెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్ పై చర్చ సందర్భంగా బీఆర్ఎస్( ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ కాంగ్రెస్ పదేపదే ఇందిరమ్మ రాజ్యం తెస్తామని గొప్పలు చెబుతున్నారని...ఇందిరమ్మ రాజ్యం అంటే వెంటనే గుర్తుకు వచ్చేది ఎమర్జెన్సీనే అన్నారు. వెంటనే దీన్ని మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు అడ్డుకున్నారు. స్వాతంత్ర్యం ఏర్పడినప్పుడు కనీసం భారత్ లో సూది తయారు చేసే పరిశ్రమలు కూడా లేవని....కానీ నేడు విమానాలు, రాకెట్లు తయారు చేసుకోగలిగే స్థితికి చేరామంటే కాంగ్రెస్ పుణ్యమేనని మండిపడ్డారు. బడ్జెట్ పై చర్చ సందర్భంగా కేవలం తెలంగాణ బడ్జెట్ పైనే మాట్లాడాలని...అంతేకానీ దేశ రాజకీయాలు, గడిచిపోయిన కాలం గురించి ఎందుకు ప్రస్తావిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ చర్చ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ...బడ్జెట్ లెక్కల్లో మాత్రం గత ప్రభుత్వాన్ని పొగుడుతూ ఉందని...కానీ బయట మాత్రం తిడుతున్నారని శ్రీహరి అన్నారు. గత ప్రభుత్వ పాలన సరిగ్గా లేకపోతే తెలంగాణ తలసరి ఆదాయం ఎలా పెరిగిందని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో అభివృద్ధే జరగకపోతే ఓటాన్ అకౌంట్ బడ్జెటే రూ.2.75 లక్షలు ఎలా పెడతారన్నారు. బడ్జెట్ సమావేశాలను ప్రభుత్వం సీరియస్ గా తీసుకోవడం లేదని మండిపడిన కడియం...బడ్జెట్‌పై చర్చ జరుగుతుంటే ఆర్థిక మంత్రి గానీ, సీఎం రేవంత్ రెడ్డి కానీ సభలో లేరన్నారు.

**అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ వాకౌట్**

తెలంగాణలో అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నాయి. తొలి సమావేశంలోనే అధికార, విపక్షాలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ సభ నుంచి వాకౌట్ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అధికార పార్టీ నేతల తీరును నిరసిస్తూ గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు సభ నుంచి బయటకు వచ్చేశారు. నిన్న కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్, సీపీఐ, ఏఐఎం ఎమ్మెల్యేలు సందర్శించిన సంగతి తెలిసిందే. అసెంబ్లీకి రావాల్సిందిగా మాజీ సీఎం కేసీఆర్‌ను సీఎం రేవంత్ రెడ్డి పలుమార్లు ఆహ్వానించారు. నిన్న మేడిగడ్డ నుంచి కూడా మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి రావాలంటూ వ్యాఖ్యలు చేశారు. అయితే కేసీఆర్ హాజరుకాలేదు. కాగా నేడు అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ ప్రారంభమైంది. ఈ చర్చకు కోరం లేదని తొలుత బీఆర్ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. 18 మంది మండి సభ్యులు ఉన్నారని మంత్రి శ్రీధర్ బాబు సమాధానమిచ్చారు. 14 మంది మాత్రమే ఉన్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ రూలింగ్ జారీ చేశారు. బడ్జెట్ చర్చలో బీఆర్ఎస్ తరపున కడియం శ్రీహరి పాల్గొన్నారు. బడ్జెట్‌పై ఎవరు సమాధానం చెబుతారని కడియం ప్రశ్నించారు. కొన్ని కారణాల వల్ల ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సభకు హాజరుకాలేదని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు బదులిచ్చారు. బడ్జెట్ చర్చపై ప్రభుత్వం సీరియస్ గా లేదని స్పష్టమవుతోందని కడియం శ్రీహరి అన్నారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీఎం రేవంత్ రెడ్డి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. మేడిగడ్డ ప్రాజెక్టు సందర్శన, సీఎం వ్యాఖ్యలపై కేటీఆర్ విమర్శలు చేయగా, సీఎం రేవంత్ కౌంటర్ ఇచ్చారు. మంగళవారం నల్గొండ సభలో కేసీఆర్ భాష సరైనదేనా? అని సీఎం రేవంత్ ప్రశ్నించారు. మనం దాని గురించి చర్చిద్దామా? అంటూ సవాల్ విసిరారు. ఇదేనా తెలంగాణ సంప్రదాయం? అని నిలదీశాడు. గుంతలా పడిపోయిన బీఆర్ఎస్‌కు బుద్ధి రాలేదు. అని నిలదీశాడు. చర్చకు రావాలంటే పారిపోయారంటూ సీఎం రేవంత్ మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సీఎం తీరును నిరసిస్తూ వారు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. కాళేశ్వరం, గోదావరి జలాలపై మాట్లాడేందుకు బీఆర్ఎస్‌కు ఆసక్తి లేదు.. సభ నుంచి ఎప్పుడు వెళ్లిపోతామా? చూసస్తున్నారని కాంగ్రెస్ సభ్యులు ఈ సందర్భంగా విమర్శించారు

# ఢిల్లీలో లొల్లిలొల్లి..

మొదటిపేజీ తరువాయి..

పోలీసులూ అప్రమత్తమయ్యారు. రైతుల్ని అదుపులోకి తీసుకుంటున్నారు. డ్రోన్స్ ద్వారా టియర్ గ్యాస్ ప్రయోగిస్తున్నారు. నేతృత్వంలో ఈ మార్చ్ జరుగుతోంది. ఛలో ఢిల్లీ పేరిట ఈ మార్చ్ నిర్వహిస్తోంది. దీంతో పాటు కూడా ఈ ఆందోళనల్లో పాల్గొంటోంది. తమ పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వడంతో పాటు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు రైతులు. అయితే...వాళ్లను అడుగడుగునా పోలీసులు అడ్డుకుంటున్నారు. ఎలాంటి హింసాత్మక ఘటనలు జరగకుండా జాగ్రత్త పడుతున్నారు. ముఖ్యంగా పంజాబ్ రైతుల్ని రెండు సరిహద్దు ప్రాంతాల్లో హరియాణా పోలీసులు కట్టడి చేశారు. టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఆ సమయంలోనే పోలీసులు, రైతుల మధ్య ఘర్షణలు జరిగాయి. ఈ ఘటనలో 24 మంది పోలీసులు గాయపడ్డారు. 60 మంది రైతులకూ గాయాలయ్యాయి. పెద్ద ఎత్తున సిమెంట్ బ్యారియర్‌లు, ఇసుక సంచులు అడ్డుగా పెట్టారు. వీటిని దాటేందుకు ప్రయత్నించిన రైతులు పోలీసులపై రాళ్లు రువ్వారు. రైతులు కనీసం 6 నెలల పాటు ఆందోళనలు చేయాలన్న ప్లాన్‌తో వచ్చినట్టు పోలీసులు చెబుతున్నారు. ఆరు నెలలకు సరిపడా సరుకులు సిద్ధం చేసుకున్నారు. ట్రాక్టర్‌లకు అవసరమైన డీజిల్ కూడా తెచ్చుకున్నారు. ఈ ఆందోళనల నేపథ్యంలో సింగూ సరిహద్దు ఉద్రిక్తంగా మారింది. ఫలితంగా ప్రభుత్వం అన్ని ఆసుపత్రులనూ అప్రమత్తం చేసింది. అదే సమయంలో అవసరమైతే భద్రతా బలగాలను మరింత పెంచాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నిరసనల కారణంగా ట్రాఫిక్‌కి తీవ్ర అంతరాయం కలుగుతోంది. సింగు, ఘాజిపూర్, చిల్లా సరిహద్దు ప్రాంతాలు మరింత ఆందోళనకరంగా ఉన్నాయి.

**చర్చలకు రండి...**

ఢిల్లీ సరిహద్దుల్లో ఆందోళన చేస్తోన్న రైతులను కేంద్ర సర్కార్ మరోసారి చర్చలకు పిలిచింది. చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకుందామని రైతు సంఘాలకు సూచన చేసింది. రాజకీయ పార్టీలతో కలిసి తప్పుదారి పట్టొద్దని రైతులను మోడీ సర్కార్ కోరింది. అయితే, నిన్నటి నుంచి ఢిల్లీ సరిహద్దుల్లోనే రైతులు నిరసనను కొనసాగిసత్తున్నారు. దేశ రాజధానిలోకి రావాలని చూసిన వారిని పోలీసులు ఎక్కడికక్కడ మోహరించి అడ్డుకుంటున్నారు. రైతులను నియంత్రించేందుకు పలు చోట్ల టియర్ గ్యాస్ కూడా ఉపయోగించారు.

# కేటీఆర్... అహంకారం తగ్గించుకో

మొదటిపేజీ తరువాయి..

అన్యాయం చేశావన్నారు. నాగురించి ముందు మాట్లాడింది కడియం శ్రీహరి అని మండిపడ్డారు. మా పార్టీ విషయాల గురించి వాళ్లకు ఏంది? అని ప్రశ్నించారు. అధికారం పోయిన తర్వాత మా పార్టీ ని చీల్చే కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాకు పదవులు ముఖ్యమా? పదవులు నాకు ముఖ్యమా.. అని ప్రశ్నించారు. రాజీనామా చేసి మీ సర్కార్ ని ప్రజల కాళ్ల దగ్గరికి తీసుకు వచ్చామంటూ కేటీఆర్ పై మండిపడ్డారు. స్పీకర్ గా మిమ్మల్ని గౌరవిస్తామని ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. మేము మాట్లాడేది తప్పు అయితే.. మంత్రులు చెప్పొచ్చన్నారు. కానీ మంత్రులు దూషించి.. స్పీచ్ ఇస్తున్నారని మండిపడ్డారు. రాజగోపాల్ ..కడియం పై చేసిన వ్యాఖ్యలు తొలగించాలన్నారు. ట్రెజరీ బెంచ్ సభ్యులకు మైక్ ఇస్తున్నారు.. మాకు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పొన్నం అంటే గౌరవం అన్నారు. కానీ వాస్తవానికి విరుద్ధ మాటలు చెప్పారు.. అందుకే అలా అన్నం అని తెలిపారు. గౌరవెల్లి డ్రై రన్ కాలేదా..? అని ప్రశ్నించారు. మేడిగడ్డ వెళ్లి మా పై బురద జల్లే పని చేస్తున్నారని అన్నారు. మంత్రిని అగౌరవ పరిచే ఉద్దేశం మాకు లేదన్నారు. కానీ ఆయన కూడా అబద్ధాలు చెప్పొద్దు అంటూ మండిపడ్డారు. మేడిగడ్డ కుంగితే.. మేడిగడ్డ నింపండి అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ మీద కోపం ఉంటే..రైతుల మీద పగ తీర్చుకోవద్దన్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## నగల షాపులో దోపిడి



హైదరాబాద్- ప్రభాతసూర్యుడు : మలక్ పేట అక్బర్ బాగ్ లోని కిశ్వ జ్యూవెలరీ లో భారీ చోరీ చోటు చేసుకుంది. బుధవారం మధ్యాహ్నం ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు బైక్ పై వచ్చారు., అక్బర్ బాగ్ చౌరస్తాలో ఉన్న కిశ్వా జ్యువెలర్స్ షాప్ లోకి వెళ్లి, షాప్ లో ఉన్నటువంటి సజావుర్ రెహమాన్ పై కత్తితో దాడి చేశారు., షాప్ లో బంగారు ఆభరణాలు ఎత్తుకొని పారి పోయారు. ఈ దాడి లో వ్యాపారికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. చోరీ ఎంత మేరకు జరిగిందని పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు ఈస్ట్ జోన్ డీసీపీ జానకి దారవత్. క్లూస్ టీన్ సందర్శించారు.

# సంపాదకీయమ్..

## జమిలీ ఎన్నికలు సాధ్యమేనా

ఒకే దేశం – ఒకే ఎన్నిక' అంశం మళ్ళీ వార్తల్లోకి వచ్చింది. కేవలం కొన్ని నెలల వ్యవధిలోనే సార్వత్రిక ఎన్నికలు జరుగనున్నాయి. ఆంధ్రప్రదేశ్ వంటి కొన్ని రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు కూడా జరగాల్సి వుంది. ఈ లోపు నిర్ణయం వెలువడి ఎన్నికలు జమిలిగా జరగడం సాధ్యం కాని పని.దేశంలోని అన్ని రాష్ట్రాల శాసనసభలకు,లోక్ సభకు ఏక కాలంలో ఎన్నికలు జరపాలనే నినాదాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పదే పదే వినిపిస్తూనే వున్నారు.మొదటి నుంచీ జమిలి ఎన్నికల నిర్వహణపై ఆయన పట్టుదలగానే ఉన్నారు. ఈ నేపథ్యంలోనే, ఈ అంశంపై అధ్యయనానికి మాజీ రాష్ట్రపతిరామ్ నాథ్ కోవింద్ నేతృత్వంలో గత సంవత్సరం సెప్టెంబర్ లో కేంద్రం ఒక కమిటీని ఏర్పాటుచేసింది.సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసే దిశగా కమిటీ పనిచేయడం కూడా ప్రారంభించింది. ప్రజల నుంచి సూచనలు, సలహాలను ఆహ్వానించింది. స్పందన కూడా విశేషంగా వచ్చింది. ఇప్పటివరకూ సుమారు 5వేలకు పైగా ఈ – మెయిల్స్ వచ్చినట్లు సమాచారం.ఇప్పటి వరకూ రెండు సార్లు సమావేశాలు జరిగాయి.కేంద్రం ఇటీవలే 6 జాతీయ పార్టీలు, 33 ప్రాంతీయ పార్టీల నుంచి అభిప్రాయాలు కోరింది. జమిలి ఎన్నికలకు సంబంధించి న్యాయ కమిషన్ నుంచి కూడా సలహాలు తీసుకుంది. మరి కొన్ని నెలల వ్యవధిలోనే సాధారణ ఎన్నికలు జరగాల్సిన నేపథ్యంలో,ప్రతిపక్ష పార్టీల వ్యాఖ్యల వేడి పెరుగుతోంది. ముఖ్యంగా తృణమూల్ పార్టీ అధినేత్రి,పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ జమిలి ఎన్నికలకు ససేమిరా అంటున్నారు.అదే విషయాన్ని స్పష్టం చేస్తూ రామ్ నాథ్ కోవింద్ కమిటీకి ఉత్తరం కూడా రాశారు. ప్రజాస్వామ్యం ముసుగులో నియంతృత్వాన్ని అనుమతించే వ్యవస్థగా మారుతుందని ఘాటైన వ్యాఖ్యలు చేశారు.జమిలి ఎన్నికలకు తాము దూరంగానే ఉంటామని స్పష్టం చేశారు. కేంద్రం లేదా రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ కారణాలతో తమ ఇదేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేయలేకపోవచ్చుని గత చరిత్రను గుర్తుచేస్తున్నారు.అనేకసార్లు లోక్ సభ రద్దయిందని, భవిష్యత్తులో కూడా అటువంటి పరిస్థితులు తలెత్తుతాయనే భయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఓటర్ల ఎన్నికల విశ్వాసాన్ని ఉల్లంఘించడం న్యాయమా? అని ఆమె ప్రశ్నిస్తున్నారు. తృణమూల్ పాటు మిగిలిన ప్రతిపక్ష పార్టీలకు అనేక భయాలు ఉన్నాయి. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ కు ఎన్నో అనుమానాలు ఉన్నాయి.'జమిలి' అంటే రాష్ట్రాలపై దాడి చేయడమేనని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శనా బాణాలు సంధిస్తున్నారు. ఈ ఎన్నికల వల్ల సామాన్యులకు ఒరిగేదేంటని కేజ్రీవాల్ ప్రశ్నిస్తున్నారు. 2024లో జమిలి ఎన్నికలు నిర్వహించడం అసాధ్యమని లా కమిషన్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. 2029 నుంచి లోక్ సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించేలా లా కమిషన్ ఓ ఫార్ములా రూపొందిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.లా కమిషన్ ఇంకా తుది నివేదికను తయారుచేయాల్సివుంది. పంచాయతీల నుంచి పార్లమెంట్ దాకా ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలన్నది బిజెపి ప్రభుత్వ ఆలోచనగా తెలుస్తోంది. ముఖ్యంగా,దీనివల్ల డబ్బు ఆదా అవుతుందని,ఆ ధనాన్ని అభివృద్ధి పనుల కోసం కేటాయించవచ్చుని మోదీ సర్కార్ వాదిస్తోంది.ఈ చర్చ ఈనాటిది కాదు.2019లో రెండవసారి అధికారంలోకి వచ్చిన వెనువెంటనే అన్ని పార్టీలను ఆహ్వానించి దీనిపై చర్చ కూడా జరిపారు. దేశ వ్యాప్తంగా మొత్తం నలబై రాజకీయ పార్టీలను ఈ సమాలోచనకు ఆహ్వానించారు. 21పార్టీలు మాత్రమే హాజరయ్యాయి. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రాంతీయ పార్టీలు అప్పట్లో జమిలి ఎన్నికలకు జై కొట్టాయి.వచ్చిన మిగిలిన పార్టీలు విభిన్న స్వరాలను వినిపించాయి.కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకంగానే ఉంది. లోక్ సభకు,శాసనసభలకు సమాంతరంగా ఏకకాలంలో జరపడం వల్ల కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి, ప్రధానంగా ఖర్చు కలిసివస్తుందన్నది వాస్తవమే. వివిధ ఎన్నికల కోడ్ పేరుతో జరగాల్సిన కార్యక్రమాలు జరగకుండా పనులు ఆగిపోవడం, సమయం వృధా అవ్వడం మొదలైన వాటికి అడ్డుగోడ పడుతుంది.తద్వారా పనిరోజులు పెరుగుతాయి.ప్రతి సంవత్సరం ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతూనే ఉంటాయి. కనీసం రెండు,మూడు రాష్ట్రాలలో ఎన్నికలు తప్పనిసరిగా వస్తుంటాయి.ఈ నేపథ్యంలో, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ కొన్ని ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోడానికి వెనుకాడే పరిస్థితి వస్తుంది.అన్ని చోట్ల సమాంతర ఎన్నికల విధానం అందుబాటులో ఉంటే,కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి మరింతగా పరిపాలనపై దృష్టి సారించే వెసులుబాటు ఉంటుంది. ఐదేళ్లకొకసారి అన్ని వ్యవస్థలకు ఒకేసారి ఎన్నికలు జరపడం వల్ల రాజకీయ సుస్థిరత నెలకొనే అవకాశం ఉంది.బిజెపి ప్రతిపాదిస్తున్న జమిలి ఎన్నికలపై కొందరు అనేక అనుమానాలు, సందేహాలు,అభ్యంతరాలు వ్యక్తం చేశారు.ఈ ప్రతిపాదన వల్ల ఎటుచూసినా,కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపికే ఎక్కువ మేలుజరుగుతుందనీ,అందుకే, దీనిపై బలంగా ప్రచారం చేస్తోందనే భావంలో ప్రతిపక్షాలు ఉన్నాయి. కేంద్రంలో అధికారంలో ఉండే పార్టీకి సంపూర్ణమైన బలం లేకపోతే, వివిధ ప్రాంతీయ పార్టీలపై ఆధారపడి సంకీర్ణ ప్రభుత్వం నడపాల్సిన పరిస్థితి వస్తుందనీ, దీని వల్ల కేంద్రంలో పాలనకు అవరోధాలు ఏర్పడతాయనే అనుమానాలు బిజెపికి ఉన్నాయి.జమిలి ఎన్నికలు జరిగితే, ఐదేళ్లపాటు యథేచ్ఛగా తమ విధానాలను అమలుపరిచే స్వేచ్ఛ మరింత బలంగా ఉంటుందనే అభిప్రాయంలోనే బిజెపి మొదటి నుంచి వుంది.కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి సహజంగా ఆధిక్యత వస్తుందనీ,దాని వల్ల ప్రాంతీయ పార్టీలకు నష్టం జరుగుతుందనే భయంలో కొన్ని ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి. దేశ సమగ్రతకు జమిలి ఎన్నికల వల్ల భంగం కలిగే ప్రమాదం ఉందనీ కొందరు విమర్శిస్తున్నారు.పరోక్షంగా అధ్యక్ష వ్యవస్థకు నిర్మాణం చేపట్టే ప్రతిపాదనలు దీని వెనకాల దాగి ఉన్నాయనే భయాలు కొందరిలో లేకపోలేదు.ఈ భయాలన్నీ ప్రధాన జాతీయ పార్టీ కాంగ్రెస్ కు, ఆ పార్టీని అనుసరిస్తున్న కొన్ని పార్టీలకు ఉన్నాయి. జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే, కొన్ని శాసనసభల పదవీకాలాన్ని కుదించాలి,కొన్నింటిని పొడిగించాలి.ఇటువంటి కీలకమైన చర్యలకు రాజ్యాంగ సవరణలు చేపట్టాల్సిన అవసరం ఉంది. దీనికి సరిపడా బలం ఉభయ సభల్లోనూ బిజెపికి ఉంది. 'సమాంతర ఎన్నికల'పై,2018 ఆగస్టులో లా కమిషన్ ఒక ముసాయిదా నివేదిక సమర్పించింది. చట్ట సవరణ జరిగిన తర్వాత, దేశంలోని సగం రాష్ట్రాల శాసనసభలు ఆమోదం తెలపాల్సిన అవసరం కూడా ఉంది.ఇక్కడకూడా బిజెపికి వాతావరణం అనుకూలంగానే ఉంది.లోక్ సభ, శాసనసభలకు ఎన్నికలు జరిగినప్పుడు కొన్నిచోట్ల క్రాస్ ఓటింగ్ జరుగుతూ ఉంటుంది. శాసనసభకు స్థానిక పార్టీకి వేసి, లోక్ సభకు జాతీయ పార్టీకి వేసే మైండ్ సెట్ కొందరు ఓటర్లలో ఉంటుంది.ఫలితాలు తదనుగుణంగా వచ్చిన అనేక ఉదాహరణలు ఉన్నాయి. ఎల్లవేళలా,అధికారంలో ఉండే పార్టీలకు సంపూర్ణమైన మెజారిటీ ఉండకపోవచ్చు.ప్రభుత్వాలు నడిపే క్రమంలో, విభేదాల వల్ల ప్రభుత్వం పడిపోయినప్పుడు,ఎన్నికలు మళ్ళీ నిర్వహించాల్సి వస్తుంది. ఇటువంటి సందర్భాల్లో ఏమి చేయాలి? అనే సందేహాలు ఉన్నాయి.ఇలా జమిలి ఎన్నికల అంశంలో అనేక అనుకూల, ప్రతికూల అంశాలు,సందేహాలు, అనుమానాలు ఉన్నాయి. వీటన్నింటిపై దేశ వ్యాప్తంగా సమగ్రమైన చర్చ జరగాలి. ప్రజామోదాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాలి.చర్చలో అన్ని పార్టీలు పాల్గొనాలి.మంచిచెడు, లాభనష్టాలు బేరీజువేసుకోవాలి. "కేవలం ఇది చర్చించే విషయం కాదని,భారత్ కు ఎంతో అవసరం", అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనేకమార్లు ఉద్ఘాటించారు. పార్టీల రాజకీయ స్వార్థాలు ఎట్లా ఉన్నా,దేశ ప్రజల మంచికి,దేశ ప్రగతికి పట్టంకట్టే విధానాలను స్వాగతించవచ్చు. 2029 లో నైనా జరుగుతాయా? అన్నది వచ్చే ఎన్నికల్లో ఫలితాలను బట్టి కొంత అంచనా వెయ్యవచ్చు.

# కరీంనగర్‌లో పాగా వేసేదెవరు..?



కరీంనగర్, ప్రభాతసూర్యుడు : పార్లమెంటు ఎన్నికలకు గడువు సమీపిస్తోంది. దీంతో తెలంగాణలో మూడు ప్రధాన పార్టీలు ఎన్నికలపై దృష్టి సారించాయి. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుతో ఉత్సాహంగా ఉన్న కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లోనూ మెజారిటీ స్థానాలు గెలుస్తామని ధీమాతో ఉంది. ఇక గత ఎన్నికల్లో అనూహ్యంగా నాలుగు ఎంపీ సీట్లు గెలిచిన బీజేపీ ఈసారి మరో నాలుగు అంటే మొత్తం 8 స్థానాలు గెలవాలని భావిస్తోంది. ఈమేరకు వ్యూహరచన చేస్తోంది. ఇక అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి డీలా పడిన బీఆర్‌ఎస్.. లోక్‌సభ ఎన్నికల్లో అయినా గెలిచి పరువు, పార్టీని కాపాడుకోవాలనుకుంటోంది. ఈమేరకు గులాబీ పార్టీ తరపున కేసీఆర్, హరీశ్‌రావు పార్టీ బలోపేతం కోసం శ్రమిస్తున్నారు.కరీంనగర్ ఉద్యమాలకు పురిటి గడ్డ. మలి విడత తెలంగాణ ఉద్యమానికి ఊపిరులు ఊదిన గడ్డ. రెండు దశాబ్దాలుగా కరీంనగర్ బీఆర్‌ఎస్‌కు కంచుకోటగా ఉంది. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కూడా ఇక్కడి నుంచి పోటీచేసి గెలిచి తెలంగాణ ఉద్యమానికి మంరిత ఊపు తెచ్చారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత 2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ విజయం సాధించారు. అయితే 2019లో ఇక్కడ అనూహ్యంగా బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ విజయం సాధించారు. దీంతో బీర్‌ఎస్‌కు కంచుకోటగా ఉన్న కరీంనగర్‌లో కమలం జెండా తొలిసారి పాతినట్లయింది.కరీంనగర్ నుంచి ఈసారి బీజేపీ, బీఆర్‌ఎస్ నుంచి పాత కాపులే బరిలో ఉంటారని తెలుస్తోంది. బీఆర్‌ఎస్ నుంచి వినోద్‌కుమార్ పోటీ చేస్తారని ఇటీవలే ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. ఇక బీజేపీ నుంచి కూడా సంజయ్ బరిలో ఉండడం ఖాయమైనట్లు సమాచారం. అయితే ఆ పార్టీలో ఉదయ్‌నందన్‌రెడ్డి కూడా టికెట్ కోసం పోటీ పడుతున్నారు. కానీ, బీజేపీ అధిష్టానం సంజయ్‌వైపే మొగ్గు చూసే అవకాశం ఉంది. ఒకవేళ సంజయ్‌కు జహీరాబాద్ టికెట్ ఇస్తే, కరీంనగర్‌ను ఉదయ్‌నందర్‌రెడ్డిని పోటీకి దించే అవకాశం ఉంది. ఇక కాంగ్రెస్ మాత్రం కొత్త అభ్యర్థి వేటలో పడింది. గతంలో ఇక్కడ ఎంపీగా పోటీ చేసిన పొన్నం ప్రభాకర్ అసెంబ్లీ ఎన్నికల్లో హుస్నాబాద్ నుంచి గెలిచారు. దీంతో ఆయన పోటీ చేసే అవకాశం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన పురుమళ్ల శ్రీనివాస్, రాజేందర్‌రెడ్డి పేర్లు గటిగా వినిపిస్తున్నాయి. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కూడా బరిలో దింపే అవకాశం ఉంది.ఇక కరీంనగర్ బరిలో ప్రధాన పోటీ బీఆర్‌ఎస్, బీజేపీ మధ్యే ఉంటుందని అంతా భావిస్తున్నారు. అయితే ఈసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినందున గట్టి పోటీ ఉంటుందని భావిస్తున్నారు. ఇటీవల బీఆర్‌ఎస్ నిర్వహించిన అంతర్గత సర్వేలో బీజేపీనే మళ్లీ గెలుస్తుందని తేలిందట. ఇంకో షాకింగ్ విషయం ఏమిటంటే.. బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ మూడో స్థానానికి పరిమితమవుతాడని తేలిందట. దీంతో గులాబీ నేతల్లో టెన్షన్ కనిపిస్తోంది.కరీంనగర్ పార్లమెంటు పరిధిలో కాపు ఓట్లే కీలకంగా మారనున్నాయి. బండి సంజయ్ మున్నూరు కాపు సామాజికవర్గానికి చెందిన నేత. బీసీ నేతగా ఆయనకు కాపులతోపాటు, ముదిరాజ్‌లు, పద్మశాలీలు, యాదవులు మద్దతు ఇస్తున్నారు. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని మోదీ ప్రకటించిన నేపథ్యంలో మాదిగలు బీజేపీకే మద్దతు ఇచ్చే అవకాశం ఉంది. ఇక వినోద్‌కుమార్ వెలమ జామాజికవర్గం నేత. కరీంనగర్ ఒకప్పుడు వెలమలకు అడ్డా. అయితే దొరల ఆధిపత్యం ఏమిటి అన్న భావన సొంత పార్టీలోనే నెలకొంది. మరోవైపు అసెంబ్లీ ఎన్నికల్లోటమి, పార్టీ అధిష్టాన పట్టించుకోవడం లేదని కేడర్‌లో ఉన్న అసంతృప్తి ఆ పార్టీ అభ్యర్థికి మైనస్ పాయింట్లుగా మారాయి. ఇక కాంగ్రెస్ రెడ్డి అభ్యర్థిని నిలపాలని భావిస్తోంది. అదే సమయంలో వెలిచాల జగపతిరావు తనయుడు రాజేందర్‌రావు కాంగ్రెస్ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అయితే ఈయన కూడా వెలమ సామాజికవర్గం నేతనే. ఇక కాంగ్రెస్ కరీనంగర్‌లో ఉన్న రెడ్డి ఓటర్లు, మైనారిటీ ఓటర్లను నమ్ముకుంది. అందుకే రెడ్డి సామాజికవర్గం నేతను బరిలో నిలపాలని భావిస్తోంది. అయితే జీవన్‌రెడ్డికి టికెట్ ఇవ్వొచ్చని ప్రచారం జరుగుతోంది. అయితే అగ్రవర్ణ నేతల నడుమ బీజేపీ లాభ పడవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఈసారి జాతీయ పార్టీల అభ్యర్థులనే గెలిపిస్తారని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రాంతీ బీఆర్‌ఎస్‌కు అవకాశం దక్కక పోవచ్చని అంచనా వేస్తున్నారు.



# అసెంబ్లీలో భాషపై రచ్చ

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో బుధవారం అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడీ వేడీ వాదనలు సాగాయి. ఇరిగేషన్ పై చర్చ సందర్భంగా సీఎం అభ్యంతర కర భాష వాడుతున్నారంటూ బీఆర్ఎస్ నేతలు లేవనెత్తగా.. సీఎం రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. మంగళవారం నల్గొండ సభలో మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తి అలాంటి భాష వాడొచ్చా అంటూ ప్రశ్నించారు. ఓ సీఎంను పట్టుకుని 'ఏం పీకనీకి పోయారా.?' అని అంటారా అంటూ నిలదీశారు. ఇదేనా తెలంగాణ సంప్రదాయం.. ఇది పద్ధతా.? అని మండిపడ్డారు. 'తెలంగాణ సమాజం పట్ల, రైతుల పట్ల గౌరవం ఉంటే ప్రధాన ప్రతిపక్షం మేడిగడ్డకు వచ్చేది. పదే పదే బీఆరెస్ నేతలు భాష గురించి మాట్లాడుతున్నారు. మాజీ సీఎం నల్లగొండలో మాట్లాడిన భాషపై చర్చిద్దామా?. మేడిగడ్డ కుంగిపోతే.. అందులో నీళ్లు నింపడానికి అవకాశం ఉంటదా?, కడియం శ్రీహరి, హరీష్ లకే పెత్తనం ఇస్తాం.. నీళ్లు నింపి చూపించండి. చర్చకు సిద్ధమైతే మీ సభాపక్ష నేతను అసెంబ్లీకి రమ్మనండి. కాళేశ్వరంపై, నదీ జలాలపై చర్చకు మేం సిద్ధం.' అని స్పష్టం చేశారు.బొక్కబోర్లా పడ్డ బీఆర్ఎస్ కు బుద్ధి రాలేదని.. కేసీఆర్ అనే పాము మొన్నటి ఎన్నికల్లోనే చచ్చిపోయిందని.. చచ్చిన పామును చంపాల్సిన అవసరం ఎవరికి ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. 'ఇప్పటికే తెలంగాణ ప్రజలు కేసీఆర్ ఫ్యాంట్ ఊడదీశారు. ఇప్పుడు చొక్కా లాగుతారు. మేడిగడ్డ, కాళేశ్వరంపై చర్చకు సిద్ధంగా ఉన్నాం. మేడిగడ్డలో కూలింది రెండు పిల్లర్లే అయితే.. వాటి మీదైనా మాట్లాడేందుకు కేసీఆర్ సభకు రావాలి. గురువారం సాయంత్రం వరకైనా కేసీఆర్ సభకు వస్తే చర్చిద్దాం. అవసరమైతే సాగునీటి ప్రాజెక్టులపైనా శ్వేతపత్రం విడుదల చేస్తాం. ప్రతిపక్ష నాయకుడిని సభకు రమ్మనండి. అవినీతి బయటపడుతుందనే సభకు రాకుండా పారిపోయారు.' అంటూ సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో సభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొంది. ఈ క్రమంలో సీఎం రేవంత్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఆయన భాష సరికాదంటూ సీఎం తీరను నిరసిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. అయితే, కృష్ణా, గోదావరి జలాలపై మాట్లాడేందుకు బీఆర్ఎస్ కు ఆసక్తి లేదని.. అందుకే సభ నుంచి వెళ్లిపోయారంటూ కాంగ్రెస్ సభ్యులు అన్నారు.అంతకు ముందు కడియం శ్రీహరిపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు రికార్డు నుంచి తొలగించాలని కేటీఆర్ అన్నారు. వాళ్లు 64 మంది ఉన్నారని.. తాము 39 మంది ఉన్నామని అధికార పక్షం అడిగిన వెంటనే మైక్ కట్ చేయడం సరికాదని అన్నారు. కేసీఆర్ పై కోపంతో రైతులను ఇబ్బంది పెట్టవద్దని ప్రభుత్వాన్ని కోరారు.

## సంగారెడ్డిలో పేలిన రియాక్టర్

మెదక్, ప్రభాతసూర్యుడు : సంగారెడ్డి జిల్లాలో అగ్ని ప్రమాదం జరిగింది. పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలో ఉన్న సీఎంహెచ్ ఫ్యాక్టరీలో రియాక్టర్ పేలింది. అదే సమయంలో పరిశ్రమలో 15 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు సమాచారం. ఆ పరిశ్రమతో పాటు పక్కనే ఉన్న వనమాలి ఫార్మా పరిశ్రమకు కూడా మంటలు వ్యాపించడంతో రెండు పరిశ్రమల్లో అగ్ని ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో కార్మికులు బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనలో పరిశ్రమలో పనిచేస్తున్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఇస్నాపూర్‌లోని కాకతీయ ఆస్పత్రికి, పటాన్‌చెరులోని పోలార్ ఆస్పత్రికి తరలించారు.రియాక్టర్ పేలుడు సమాచారం అందుకున్న సిబ్బంది వెంటనే స్పందించి ఘటనాస్థలికి చేరుకున్నారు. రెండు కర్మాగారాల్లో మంటలు వ్యాపించడంతో సీనియర్ అగ్నిమాపక అధికారుల ఆదేశాల మేరకు పటాన్‌చెరు, సంగారెడ్డి, సదాశివపేట, బీహెచ్‌ఈఎల్ నుంచి అగ్నిమాపక యంత్రాలను పంపించారు. తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మంటలను అదుపు చేసేందుకు సహకరించిన కార్మికులు రసాయనాలు పీల్చి అస్వస్థతకు గురయ్యారు. వీరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. గాయపడిన వారిని మోతు మాలిక్, దత్తు కులకర్ణి, కాలేషా పఠాన్, గోయదరావత్‌లుగా గుర్తించారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న ఆర్డీఓ రవీందర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదంపై ఆరా తీశారు. అనంతరం ఆస్పత్రికి వెళ్లి గాయపడిన వారిని పరామర్శించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215